## మినీ కథ

# పేరు



నా పేరు సుబ్బారావండి.

అది మా అమ్మా, అయ్యా గొప్పగొప్పోళ్ళందరూ సుబ్బారావులే అయ్యారని పందొమ్మిది వందల అరవై నాలుగులో ఆ పేరు బలవంతంగా తగిలించేశారండి.

నేను ఒక దుర్ముహూర్తాన రచయితనయ్యానండి.

అప్పటినుండి అది ఒక దురదలా వ్యాపించి తరచు రచనలు చేయడం ప్రారంభించానండి. కానీ ఒక పత్రికాఫీసైనా కన్నెత్తి చూస్తే కదండి. కట్నం ఇవ్వలేని కొత్త కోడలు పుట్టింటికి వచ్చేసినట్లు నా రచనలు కూడ మాయింటికి వచ్చేస్తూ వుండేవండి. క్రమంగా వాటికి నేను అలవాటు పడిపోయానండి.

ఇంట్లో వాళ్ళనుండి, పోస్ట్‌మాన్‌వరకూ నా తిరిగివచ్చిన రచనలుచూసి ఘోరాతిఘోరంగా నవ్వేస్తుంటగా, నేను హీనాతిహీనంగా ఏడ్చేసేవాడినండి. నేను ఇలా 'సాహితీపర ట్రాజెడీ'లో పడటం సహించలేని ఓ మిత్రుడు నాకు అమూల్యమైన సలహా ఒకటి ప్రసాదించాడండి. అదేమిటంటే- నా పేరు మార్చేసుకోమన్నాడండి.

"అదేం నా పేరు బాగానే ఉంది కదా" అన్నానండి నేను అమాయకంగా.

"నీ పేరుకేం బాగానే ఉంది. కానీ, మన ఆంధ్రదేశంలో వయసొచ్చిన ఆడపిల్ల వరదాపడి ఎటువైపో ఓరాయి విసిరిందనుకో అది ఖచ్చితంగా సుబ్బారావుకో, రామారావుకో తగుల్తుంది కనుక సుబ్బారావుల పేరు విని, విని సంపాదకులవారు విసుగెత్తిపోయారు. ఆడవాళ్ళను ఆకర్షించేలాంటి కొత్తపేరు ఏదైనా పెట్టుకో" అని సలహా ఇచ్చాడండి.

నిజమే మరి. ఆంధ్రదేశం సుబ్బారావులకు ప్రసిద్ధి అని ఏదో పత్రికలో చదివానండి. మరో ప్రముఖరచయిత తన నవలలో సుబ్బారావు పేరు వింటే నాకెందుకో నవ్వు వస్తుందనికూడ రాశారండి. ఎందుకు అతనికి నవ్వు వస్తుందో తెలుసుకోవాలని ఇప్పటికి ఆయనకు ఉత్తరాలు రాస్తున్నానండి. జవాబు మాత్రం రాలేదండి.

ఎలా అయితేనేం నేనో మంచిపేరు అహోరాత్రులు ఆలోచించి, ఆలోచించి 'కవిశ్రీ' అని పేరు పెట్టుకున్నానండి. (నాకు కవితలు రాయడం రాకపోయినా) నేను పేరు మార్చేసుకున్నాను అనగానే పెళ్ళాన్ని మార్చేసుకున్నంత గాబరాపడిపోయారండి మా అమ్మా, అయ్యా. 'నా పేరు సుబ్బారావే, నా కలంపేరు కవిశ్రీ' అని చెప్పినా వినకుండా సినిమాల్లో ట్రాజెడీ సీన్ వచ్చినపుడు ఏడ్చినంత ఘోరంగా ఏడ్చేశారండి. ఏ పేరు పెట్టుకున్నా తమరి రచనలు పడిచావవుఅంటూ నా స్నేహితులు, కామెంటు చేసేశారండి.

నాకు బోలెడంత కోపం వచ్చేసి, అప్పటికప్పుడే అత్యద్భుతమైన సాహిత్యం (నా దృష్టిలో) సృష్టించేశానండి.

దానిని ఒక ప్రముఖ పత్రికకు పంపించేసి, ఫలితం కోసం ఎదురుచూస్తున్నానండి.... శుభ ముహూర్తమని నేను అనుకుంటున్న తరుణంలో పేరు మార్చుకోమని సలహా ఇచ్చిన మిత్రుడు ఆ ప్రముఖ వార పత్రికలో కవిశ్రీ అంటే నా కలం పేరుతో రాసిన కథ 'మొదటి ఏడుపు'ను చూపించాడండి.

నా ఆనందానికి అవధులు లేవండి. పత్రిక తెచ్చిన నా మిత్రుడ్ని కొత్త హీరోయిన్‌ను సీనియర్ హీరో కౌగిలించుకున్నంత ఘోరంగా ఎత్తి కుదేశానండి. వాడు ఉక్కిరి బిక్కిరై పోయి, ఇంటికెళ్ళి నేను పట్టుకున్న ప్రతీచోట 'అమృతాంజనం' పట్టించుకున్నాడని తెలిసి తరువాత

# మారింది

## మినీ కథ

'సారీ' చెప్పాననుకోండి. అది వేరేసంగతి.

"మరి పత్రికలో కథ పడుతున్నట్టు నాకు ఇంటిమేషన్ రాలేదేం" అని అడిగానండి.

"ఆ ప్రముఖ పత్రిక పాలసీ అలాంటిది.... రచయితలకు తెలీకుండా కథలు పత్రికలో వేసి, రచయిత తన పేరుచూసి షాక్ అయిపోయి, హఠాత్తుగా గుండెఆగి చావాలని ఇలాంటి ఎక్స్పెరిమెంట్ చేస్తుంటారు" అని చెప్పారండి. ఏదయితేనేం- నాకు సన్మానంలో శాలువా కప్పినట్టు కల వచ్చిందండి. ఆ కలలో ఒక సన్మాన పత్రంలో నన్ను పొగుడుతున్నట్టుకూడ కల వచ్చిందంటి.

ఆరోజే నాకు మిత్రులనబడే శత్రువులకు నా కథను అచ్చులో చూపెట్టానండి. కాని వారు- "మా చెవ్వులిరకవ పువ్వులు పెట్టకు. ఎవరిదో రచన చూపించి నాకలం పేరుతో రాసినది అనగానే నమ్మేతామా" అన్నారా ప్రబుద్ధులు.

వారంతే; వారికి సాహిత్యం గురించి తెలియకపోయినా నోటికి వచ్చినట్టు వాగుతారు వాల్మీకి భారతాన్ని, వ్యాసుడు రామాయణాన్ని రాసాడు అనే నాలెడ్జి వారిది. అలాంటి మిత్రులు దొరకడం నా ఖర్మ.

వారి కామెంటు విని నేను చాలా బాధ పడ్డానండి.

"నాకథకు పారితోషికం రాగానే వారికి చూపించి.... నా సత్తా తెలుపాలనుకున్నానండి .. ఇంతలో రెండో పత్రిక నాకథ పడిన తరువాత మూడో సంచికకూడ వచ్చేసిందండి. అందులో చాలామంది నా కథను మెచ్చుకుంటూ బోలెడన్ని ఉత్తరాలు రాసేశారండి.

"క్రిందటి నెల కవిశ్రీగారి 'మొదటి ఏడుపు' చివరివరకూ ఏడిపించింది. రచయిత కవిశ్రీగారికి కృతజ్ఞతలు"అనిఒకరు రాశారండి.

"కవిశ్రీ వంటి రచయిత ఇంతకాలంబ్రేక్ అయినందుకు బాధగా ఉంది ..., మొదటి ఏడుపు చదువుతున్నప్పుడు నా చిన్నప్పటి సంఘటన గుర్తుకు వచ్చి, నా మొదటి ఏడుపు జ్ఞాపకం చేసుకుని థ్రిల్లింగ్‌గా ఫీలయ్యాను" అని మరొకరు రాశారండి.

మొత్తం మీద నా రచన అంతమందిని కుదిపినందుకు నేను రచయితగా పనికి వస్తాననుకున్నానండి గట్టిగా.

అయితే ఇక్కడొక విషయాన్ని మీకు చెప్పాలండి. నాకు నారచనకు సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి పారితోషికం రాలేదండి. పారితోషికం సంగతి అలాఉంచి కనీసం ఏదో ఒక లెటరు లాంటిది వస్తే నా మిత్రులకు చూపించుకోవాలని ఆశ పడ్డానండి.

"అల్పే అలాంటి ఆశలేం పెట్టుకోకు. కొత్తరచయితలకు రెమ్యూనరేషన్ పంపరు. వాళ్ళు నీ రచన వేసుకున్నందుకు సంతోషపడు"అన్నారండి కొందరు.

ఈసారి నా రెండవ రచన పంపించానండి, అదే పత్రికకు. రెండోసారిఅయినా నేను రచయితగా గుర్తింపబడతానని ఆశతోనే పంపించానండి. అయితే ఈసారి వారంలోపల ఆరచన తిరిగి వచ్చేసిందండి, ఆ బుక్‌పోస్టు విప్పిచూస్తే అందులో ఒక లెటరు లాంటిది ఎడిటర్ నుండి వచ్చినది ఉందండి.

అందులో ఇలా ఉంది.

కవిశ్రీ కాని కవిశ్రీ గారికి—

మీ రచన స్వంతది. అయినా మీపేరు 'కాపీ' అని చెప్పడానికి చింతిస్తున్నాం. కవిశ్రీ రిజర్వ్డ్ నేమ్. కవిశ్రీ అంతటి రచయిత గురించి మీకు తెలియకపోవడం సాహితీలోకానికే తీరని అవమానం. పది సంవత్సరాల క్రితం ఒకే కథతో ఫేమస్ అయిపోయిన, అనంతరం రచనా వ్యాసంగాన్ని మానుకుని, తద్వారా సాహితీ లోకానికి సేవచేస్తున్న 'కవిశ్రీ' మీరేఅనుకొని- మా సిబ్బంది పొరబడి- మీ'మొదటి ఏడుపు'ను పొరపాటున ప్రచురించేశారు. సాధారణంగా మేం కొత్త రచయిత మొదటి రచన తీసుకోం.

ఎలాంటి సాహితీ విలువలూ లేని మీ 'మొదటి ఏడుపు' కవిశ్రీ పేరుమీద ప్రచురించినందుకు సదరు కవిశ్రీగారు మా సిబ్బందిని తీవ్రంగా మందలించారు. పత్రికాఖి ముఖంగా మిమ్మల్ని, మమ్మల్ని క్షమాపణలు చెప్పమన్నారు. అతనికి ఎలాగోలా నచ్చచెప్పి రాబోయే సంచికలో 'సవరణ' వేస్తున్నాం.

మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. మీపేరు మార్చుకుని రచనలు చేయండి. కవిశ్రీ పేరుపై ఇకమీదట రచనలు చేస్తే తగిన విధమైన చర్య తీసుకుంటాం— ఎడిటర్.

నా బుఱ్ఱ రైలింజను చక్రంలా తిరిగిపోయిందండి.

ఆ పొగడ్తలూ, ప్రశంసలూ నావి కావన్నప్పుడు నాకు ఎలా ఉంటుందో చెప్పండి.

నేను మళ్ళీ 'సుబ్బారావు' పేరుమీదనే రచనలు చేస్తున్నానండి. అయితే అవి మళ్ళీ తిరిగొచ్చేస్తున్నాయండి.

—శ్రీచరణ్

క్వార్టర్ నెం. 11,
జయభారతనగర్‌కాలని,
కంచరపాలెం(పోస్టు)
విశాఖపట్నం-530 008.

